# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

సోమవారం | 18 మార్చి, 2024 | పేజీలు : 05


## పట్టణ ప్రజలకు మంచినీటి ఎద్దడిని నివారించాలి



**ప్రజాపక్షం/నర్సంపేట:** పట్టణ ప్రజలకు వేసవి కాలంలో మంచినీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని వరమ్మ తోట బావి, ఫిల్టర్ బెడ్, నల్లాల బావిలను నర్సంపేట ఎంఎల్ఏ దొంతిమాధవరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ బావులను, ఫిల్టర్ బెడ్‌ను వెంటనే మరమ్మత్తులు చేసి వేసవిలో పట్టణ ప్రజలకు ఇబ్బందులకు గురికాకుండా నీరు అందించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు.

# 10వ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని

**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః** మార్చి 18 నుండి ఏప్రిల్ 2 వరకు నిర్వహించు పదవ తరగతి పరీక్షల సందర్భంగా జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు, విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా పరీక్షలు వ్రాయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నామని, జిల్లాలో 3088 మంది పరీక్షలు వ్రాస్తున్నారని, వారి కోసం 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి, పరీక్షల నిర్వహణలో 21 మంది చీఫ్ సూపరింటిండెంట్, 22 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, 200 మంది ఇన్విజిలేటర్లు పరీక్షల నిర్వహణలో పాల్గొంటారని, విద్యార్థులు ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన డ్యూయల్ డెస్క్‌లను అందుబాటులో ఉంచామని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అవకతవకలు జరగకుండా రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు, సైన్స్ పరీక్ష మినహాయించి ప్రతి పరీక్ష ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు పరీక్ష ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరుగుతుందని, సైన్స్ పరీక్ష ఉదయం 9.30 నుండి 11 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు హాల్ టికెట్స్, పరీక్ష ప్యాడ్, పెన్, పెన్సిల్, స్కేల్, షార్పనర్, ఎరేజర్, జామెట్రీ పరికరాలను మాత్రమే తీసుకురావాలని అన్నారు పరీక్ష రాయడానికి ముందు ఓఎంఆర్ షీట్‌లోని వివరాలను, పరీక్షా రాసే విద్యార్థిని, విద్యార్థులు ఇన్విజిలేటర్ ధృవీకరించాలని, పరీక్ష పత్రం జారీ అయిన వెంటనే, విద్యార్థులు తమ హాల్ టికెట్ నెంబర్‌ను జారీ చేయబడిన ప్రశ్నాపత్రంపై విధిగా రాయాలని అన్నారు. ప్రధాన జవాబు పత్రంతో అదనపు సమాధాన పత్రం/ పార్ట్ బి, గ్రాఫ్, మ్యాప్‌లను జత చేయాలని, దారంతో గట్టిగా కట్టాలని, పరీక్ష డ్యూటీలో ఉన్న సిబ్బంది, విద్యార్థులు పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్ష కేంద్రం వదిలి వెళ్ళడానికి అనుమతించబడరని, పరీక్ష సమయంలో, ఒక అభ్యర్థి కాపీయింగ్/మాస్ కాపీయింగ్ చేస్తే నిబంధనల ప్రకారం డిబార్ చేసి తదుపరి పరీక్షలకు అనుమతించబడరని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆటో యూనియన్ నాయకులు



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట డివిజన్ ఆటో యూనియన్ 70మంది నాయకులు ఆదివారం నర్సంపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ వారికి పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు ఆకుతోట ఇంద్రసేనారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇస్రం కుమార్, పట్టణ ఇన్‌చార్జి కొమ్ము వినయ్ కుమార్, ఉపాధ్యక్షుడు మద్దెల రాంబాబు, పెరుమాండ్ల రాజేష్, కార్యదర్శి పస్తం ఎల్లస్వామి, సహాయ కార్యదర్శి సోమ వెంకట్, కోశాధికారి ఎండి జావీద్, సీనియర్ డ్రైవర్స్ ఎండీ జాకీర్, మర్రి రాజు, కొడారి రాజుతోపాటు 70మంది70మంది యువకులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు పెండెం రామానంద్ తదితరులు పాల్గొన్నారు

## యువకులని మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్లు

**ప్రజాపక్షం/ గార:** యువకులను టార్గెట్ చేసి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు. 'గార్ల మండల పరిదిలో అంజనాపురం గ్రామానికి చెందిన సాయి కుమార్ అనే యువకుడు ప్రదాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్ర పధకంలో ఆల్ ఇండియా ఫెర్టిలైజర్స్ వారు కెమికల్ సహకారం కోసమని నోటిపికేషన్ వెలువరించారు.ఒక లింక్ ఇచ్చి ఆ లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అందుకు కొంత కర్చు అవుతుందని తెలిపారు. అందుకుగాను యువకుడు పలు దపాలుగా ఫోన్ పే ద్వారా 1లక్ష35 వేలు పంపించాడని, మరికొంత డబ్బు 75 వేలు చెల్లించాలని మెస్సేజ్ పంపడంతో, సైబర్ నేరగాళ్ళ చేతిలో మోసపోయానని గ్రహించిన యువకుడు స్థానిక పోలీసులకు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన యెడల 1930 కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ జీనత్ కుమార్ తెలిపారు.



## గట్టమ్మ దేవాలయాన్ని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాదే



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః** తెలంగాణ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జడ్జి ఆలోక్ ఆరాదే గట్టమ్మ దేవాలయాన్ని ఆదివారం దర్శించకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపోడ్ గట్టమ్మ పూజారుల సంఘం ఆధ్వర్యంలో హైకోర్టు చీఫ్ జడ్జి ఆలోక్ ఆరాదేకి ఆదివాసీ నాయకపోడ్ గట్టమ్మ పూజారులు శాలువాతో సన్మానించి ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైకోర్టు చీఫ్ జస్టిస్ గట్టమ్మ పూజారులయిన ఆదివాసీ నాయకపోడులు పూజారులతో మాట్లాడి గట్టమ్మ యొక్క విశిష్టత గురించి అమ్మవారి ప్రత్యేకత గురించి అడగడం జరిగింది. పూజారులు గట్టమ్మ తల్లి యొక్క విశిష్టత గురించి అమ్మవారి ప్రత్యేకత గురించి అడగడం జరిగింది. పూజారులు గట్టమ్మ తల్లి యొక్క విశిష్టతను చెబుతూ మేడారం చుట్టు ఏడు గట్టమ్మ తల్లులు ఉండడం జరిగిందన్నారు. మేడారం చుట్టు గట్టమ్మ తల్లుల్లో పెద్ద తల్లి ములుగు గట్టమ్మ అని అన్నారు. మేడారం వెళ్లే ప్రతి భక్తుడు గట్టమ్మ తల్లిని దర్శించుకున్న తర్వాత మేడారం వెళ్ళడం జరుగుతుందని అన్నారు. గట్టమ్మ తల్లికి భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుండి గట్టమ్మ పూజారులుగా ఆదివాసీ నాయకపోడ్‌లు పూజలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఆదివాసీ నాయకపోడులు పాండవుల వంశస్థులకు చెందిన వారని హైకోర్టు జడ్జికి వివరించారు. ఆదివాసీ నాయకపోడ్ ఆచార సంస్కృతి సంప్రదాయం ప్రకారం అమ్మవారి పూజలు నిర్వహిస్తూ దాదాపు 120 పైగా కుటుంబాలు జీవనంను కొనసాగిస్తున్నారు. మేడారం జాతర సమయంలో గట్టమ్మ ఎదురుపిల్ల పండగను లక్ష్మీదేవర్ల పూజారులతో అంగరంగ వైభవంగా నిర్ణయించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గట్టమ్మ ప్రధాన పూజారులు కొత్త సదయ్య, పాల్గొన్నారు.

**హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్‌పిలు**

ములుగు జిల్లా కేంద్రానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాదేకి గట్టమ్మ దేవాలయం వద్ద జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సమ్మక్క సారలమ్మ ప్రతిమను అందజేసి స్వాగతం పలికారు. అదేవిధంగా రామప్ప దైవ దర్శనానికి వచ్చిన జడ్జికి ఎస్‌పి డాక్టర్ శబరీష్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

# బస్సు ప్రమాద క్షతగాత్రులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రెండు రోజుల క్రితం ఆర్టీసీ బస్సు, డీసీఎం వాహన ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఎంజీఎం హాస్పిటల్ కి వెళ్లి సిపిఐ పార్టీ బృందం పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, బస్సు ప్రమాదంలో గాయపడిన ముగ్గురు మహిళలను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. తీవ్రంగా గాయపడిన వారిలో బొల్లి సమ్మక్క, దుర్గం రాజేశ్వరి, మంతనే లావణ్య ఈ ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. వెంటనే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు,జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా చొరవ చూపి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. అదేవిధంగా వారికి నష్టపరిహారం కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. తీవ్ర గాయాలు అయ్యి విషమంగా వున్నా ఈ ముగ్గురు మహిళలను హైదరాబాద్ కార్పొరేట్ హాస్పిటల్లో చికిత్స అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వేముల శ్రీకాంత్, బొడ్డు మనోజ్,వాసం రజిత మౌనిక, రాజేష్ తదితరులు పరామర్శించారు.

## సోమనర్సయ్యకు వ్యాయామ విద్యలోడాక్టరేట్



**ప్రజాపక్షం/జఫర్గడ్:** జఫర్గడ్ మండల కేంద్రానికి చెందిన సముద్రాల సోమన ర్సయ్య వ్యాయామ విద్యలో డాక్టరేట్ లభించడం అభినందనీయమని ప్రొఫసర్ పి.రమేశ్ రెడ్డి అన్నారు. పీహెచ్డీ సూపర్వైజర్ అయినటువంటి ప్రొఫసర్ పి.రమేష్ రెడ్డి కిట్స్ వరంగల్ ఆధ్వర్యంలో అన్ అనాలసిస్ ఆన్ ఆంత్రోపోమెట్రిక్ మెజర్మెంట్స్ అండ్ ఫిజికల్ కాంపోనెంట్స్ ఎమాంగ్ జూనియర్ వాలీబాల్ ప్లేయర్స్ ఇన్ రిలేషన్ టు దేర్ పెర్ఫార్మెన్స్ లో రీసెర్చ్ పూర్తి చేసి కాకతీయ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ తీసుకోవడం జరిగిందినీ తెలిపారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ డీన్ ప్రొఫసర్ రామనాథ్ కిషన్, కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ప్రొఫసర్ రవికుమార్, ప్రిన్సిపల్ ఏటిబిటి ప్రసాద్ తో పాటు గ్రామస్తులు సోమనసయ్య చిన్ననాటి మిత్రుడు అభినందించారు.

## చైర్మన్ శ్రీకాంత్ గౌడ్‌కు సన్మానం



**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి :** తెలంగాణ బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన టిపిసిసి ఓబిసి సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌ను సిద్దిపేట జిల్లా బిసి సెల్ చైర్మన్ డాక్టర్ సూర్యవర్మ మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈసందర్భంగా డాక్ట్ సూర్య వర్మ మాట్లాడుతూ బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మగా శ్రీకాంత్ గౌడ్‌ను నియమించటం యువత రాజకీయ ప్రోత్సాహానికి నిదర్శమన్నారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ అధిష్టానం తప్పక గుర్తింపు లభిస్తుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షులు గరిపల్లి వెంకట్, బంక చిరంజీవి, మిద్దే ప్రసాద్, డిసిసి ప్రధాన కార్యదర్శి మోతే కుమార్, దిలిప్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



**ప్రజాపక్షం/కౌడిపల్లి :** మద్యానికి బానిసై ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన కౌడిపల్లి లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుడ్డంల సత్యమ్మ భర్త కీ శే నర్సింలు కు ఇద్దరు కుమారులు మొదటి కుమారుడు గుడ్డంల కిరణ్ 21 సంవత్సరాలు వృత్తి కూలి పని కాగా మద్యానికి బానిసైన కిరణ్ పలుమార్లు డబ్బుల కోసం తల్లిని ఇబ్బందులకు గురి చేసేవాడనీ శనివారం 20,000 కావాలని తమ్ముడు శరత్ కు ఫోన్ లో వాట్సాప్ మెసేజ్ పెట్టాడని తమ్ముడు, తల్లి వాళ్ళ అమ్మ ఇంటికి వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతుడి తల్లి సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ రెడ్డి తెలిపారు.

## ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రకాష్‌రెడ్డి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా 37 కార్పొరేషన్ చైర్మన్ నులను ఎన్నిక చేసింది. అందులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయితే ప్రకాష్ రెడ్డికి రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించారు. నా ఎన్నికకు సహకరించిన మంత్రి శ్రీధర్ బాబుకు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, కాంగ్రెస్ నాయకులు ఖ్యాతరాజ్ సాంబమూర్తి, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు నంగావత్ భాస్కర్ లు ప్రకాష్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

## నిరుపేద ముదిరాజ్ కుటుంబాలకు అండగా మెపా



**ప్రజాపక్షం/నెక్కొండః** నెక్కొండ మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన పిట్టల రచన ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుండి అశోక్ ముదిరాజ్ నిరుపేద కుటుంబానికి అండగా నిలవాలని కోరగా, రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి ముదిరాజ్ 50 కెజిల బియ్యం, కేసముద్రం మండల మెపా అధ్యక్షుడు నారబోయిన రమేష్లు 50 కెజిల బియ్యం మొత్తంగా ఒక క్వింటా బియ్యంను పిట్టల రచన కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి క్వింటా బియ్యం అందజేశారు. ఈ సహాయం చేసిన మెపాకు వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెపా మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుండి అశోక్, రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి, జిల్లా నాయకులు మహేష్, శ్రీనాథ్, మండల నాయకులు చిట్టెబోయిన మధు, కొండయ్య, కొండా శ్రీను, మహేష్, మెపా సభ్యులు పాల్గొన్నారు.

## గార్లలో ఇసుక ట్రాక్టర్ పట్టివేత




**ప్రజాపక్షం/గార్ల :** ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లను పోలీసులు పట్టుకున్నారు. గార్ల మండలం చంద్రగిరి గ్రామం సలివాగు నుండి గార్ల గ్రామానికి చెందిన ఆగాల రామారావు తన ట్రాక్టర్ లో ఉసుక తరలిస్తుండగా, ట్రాక్టర్ ను పట్టుకుని గార్ల పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జీనత్ కుమార్ తెలిపారు.

## బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి



**ప్రజాపక్షం/హన్మకొండ:** వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆరూరి రమేశ్ బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి నాటకీయాల, డ్రామాల మధ్య ఎట్టకేలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీ కండువా ధరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మారపల్లి రామచంద్రారెడ్డి, వరంగల్ పార్లమెంటు కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, బీజేపీ నాయకులు ఆరూరి రమేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## దివ్యాంగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** త్వరలో జరుగబోయే పార్లమెంటు ఎన్నికల్లో దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి ముందుగానే మినహాయింపు ఇవ్వాలని దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి డి. వాసంతిని కలిసి వినతిపత్రం అందచేశారు. గతంలో చీఫ్ ఎలక్షన్ కమిషన్ దివ్యాంగులకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఇచ్చిన ఆర్డర్ కాపీతో పాటుగా జిల్లాకు సంబంధించిన దివ్యాంగ ఉపాధ్యాయుల వివరాలను అందచేశారు. ఈ సందర్భంగా డీఈఓ సానుకూలంగా స్పందిస్తూ దివ్యాంగ ఉపాధ్యాయులు విధులకు సంబంధించిన విషయం మా దృష్టిలో ఉందని, సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఐత అనిల్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు,స్కేలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ ఐత రామ్ చందర్, దళిత రత్న అవార్డు గ్రహీత ఐత యాకయ్య, ఐత మల్లేష్, అంబేద్కర్,బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల కమిటి అధ్యక్షులు ఐత రాజు, హైస్కూల్ హెడ్ మాస్టర్ గారె క్రిష్ణ మూర్తి , అంబేద్కర్ సంఘం యువజన నాయకులు పీరని ప్రవీణ్, అయిత రవి, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు కంతుల జంపి, రాకేష్, సాయి, మహేష్, రాజు పాల్గొన్నరు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన వైస్ ఎంపీపీ



**ప్రజాపక్షం/స్టేషన్ ఘనపూర్ :** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అదేవిధంగా కుతుబుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కొలను హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండల వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాటికొండ గ్రామాభివృద్దే ధ్యేయంగా ప్రజలకు మరింత సేవచేయాలనే తలంపుతో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితున్నై సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పని చేయడానికి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. ఏ పార్టీలో చేరిన తాను ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు.

# పది పరీక్ష కేంద్రం ఏర్పాటుకు బాధ్యుడైన ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/నల్లబెల్లి :** ప్రవేటు పాఠశాలలో పది పరీక్ష కేంద్రం ఏర్పాటుకు బాధ్యుడైన ఎంఈఓపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల డిటిఎఫ్ అధ్యక్షుడు తూముల రఘువీర్ డిమాండ్ చేశారు . ఆదివారం డిటిఎఫ్ మండల అధ్యక్షుడు టి.రఘువీర్ విలేకరులతో మాట్లాడుతూ నల్లబెల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల మన ఊరు మన బడిలో సర్వంగ సుందరంగా అనేక వసతులతో నిర్మించిన పాఠశాలను మరిచిపోయి పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ప్రవేటు పాఠశాలకు అప్పగించడం సరైంది కాదన్నారు . 2004 నుండి పరీక్ష కేంద్రంగా ఉన్న ప్రాథమిక పాఠశాలను వదిలి ప్రభుత్వ పాఠశాల్లోనే పది పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలన్నా నిబంధనలను ఎంఈఓ తుంగలో తొక్కరన్నారు . ప్రవేటు యాజమాన్యంతో కుమ్మక్కై ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తున్న ఎంఈఓ వైకరి పట్ల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు . పది పరీక్ష కేంద్రం ప్రవేటు పాఠశాలలో నిర్వహించేందుకు సిఫారసు చేసిన మండల విద్యాశాఖ అధికారిని తప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన ఎంఈఓ మండలంలోని కొండాపూరం ప్రాథమికోన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయున్ని పేద ఆదివాసి విద్యార్థులకు చదువు చెప్పకుండా యూనిజ్‌లేటర్‌గా వేయడం పట్ల అవేధన వ్యక్తం చేశారు . పరీక్ష కేంద్రం నుండి 8 కిలో మీటర్ల దూరం లోపు ఉన్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను నియమించాలనే నిబంధనలకు పాటించలేదన్నారు . ఇప్పటికైనా జిల్లా అధికారులు పది పరీక్ష కేంద్రం నిబంధనలు పాటించని మండల విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని రఘువీర్ జిల్లా కలెక్టర్‌ను కోరారు .




## కల్వకుంటలో పోలీసుల కవాతు



**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో ఆదివారం రోజున స్థానిక ఎస్సై శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసుల కవాతు నిర్వహించారు. గ్రామాలలో పోలీసుల సూచన మేరకు ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదని ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు ఆటంకాలు సూచించద్దని ఆయన తెలిపారు. ఒకవేళ ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించే చర్యలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకునేది ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సిఆర్పిఎఫ్ కేంద్ర బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో ఆవు మృతి



**ప్రజాపక్షం/కొహెడః** సిద్దిపేట జిల్లా కొహెడ మండలం మైసంపల్లిలో పిడుగుపాటుతో పాడిఆవు మృతి చెందింది. వివిరాల్లోకి వెళ్తుతే మైసంపల్లి గ్రామానికి చెందిన రైతు బడుగు రమేష్ తన వ్యవసాయ భావి వద్ద ఆవును కట్టి వేసాడు.శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసిన సమయంలో పిడుగు పడి ఆవు మృతి చెందిందన్నారు. ఉదయం బావి దగ్గరకు వెళ్ళి చూస్తే ఆవు మృతి చెందిందని, ఆవు విలువ 70వేల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వం తనకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

## వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/ఖానాపూర్ః** ఖానాపురం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గొట్ట సోమయ్య సత్యవతి కుమారుడు ప్రశాంత్ రమల వివాహా వేడుకలో మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎడ్ల జగన్మోహన్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎస్‌కె ముస్తఫా, సీనియర్ నాయకులు మందలపు శ్రీనివాస్, వీరమనేని సాగర్ రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది



**ప్రజాపక్షం/జహీరాబాద్:** లింగాయత్ సమాజ్ అభివృద్ధి కోసం ఒక్క కాంగ్రెస్ పార్టీ తప్ప ఎవరూ కూడా అంత చిత్తశుద్ధితో పని చేసింది లేదని, 2009 కంటే మొదలు లింగాయత్ ఓసి సామాజిక వర్గానికి చెందిన వారు కాగా రాష్ట్రంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ అధికారంలో ఉండగా, కేంద్రంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో 2009 లో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యునిగా సురేష్ కుమార్ షెట్కార్ లింగాయత్ సామాజిక వర్గానికి ఓసి నుండి బీసీల్లో మార్చాలని ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డికి వినతి చేయగా స్పందించి లింగాయత్ సామజిక వర్గానికి ఓసి నుండి బీసీ డి లో మారుస్తూ కేంద్ర ప్రభుత్వం నుండి ఆమోదం పొందారని జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ డా ఆగం చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కండేం నర్సింలు, మండలం అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, కోహిర్ అధ్యక్షుడు రామలింగారెడ్డి, న్యాల్కల్ శ్రీనివాస్ రెడ్డి, ఝూరసంగం హన్మంత్ రావు పాటిల్, రాజ్ శేఖర్ షెట్కార్, నాగేందర్, శంకర్ పాటిల్, మణిక్ పటేల్ న్యాయవాది, బౌగి మల్లిఖార్జున్, వీరశైవ లింగాయతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫిల్మ్ కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నికైన గిరిధర్ రెడ్డికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/జహీరాబాద్ :** గత మూడు రోజుల క్రితం రాష్ట్రంలోని ఖాళీగా ఉన్న 54 కార్పోరేషన్ చైర్మెన్లలో 37 రాష్ట్ర స్థాయి కార్పోరేషన్ చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం సర్కులర్ జారీ చేసిన సంగతి తెలిసిందే. సంగరెడ్డి జిల్లా జహీరాబాద్ మండల పరిషద్ ఎంపిపి ఎన్ గిరిధర్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ సంస్థ చైర్మన్ గా అవకాశం కల్పించినందున ఆయన స్వగృహంలో జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యన్.గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నాకు ఈ తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ సంస్థ చైర్మన్ రావడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు భీమయ్యా, బర్కత్ అలీ, మొహమ్మద్ జమిల్, నతనియల్, అశ్విన్, నర్సింహ యాదవ్, నర్సింహారెడ్డి, గొల్ల భాస్కర్, ఇనాయత్ అలీ, ప్రతాప్ రెడ్డి, జుబేర్ పటేల్ గోవింద పూర్, అత్తర్ గడి, హర్షవర్ధన్ రెడ్డి, జగదీష్ రెడ్డి నాయకులు, కాంగ్రెస్ నాయకులు, యన్. ఏస్,యూఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం




**ప్రజాపక్షం/గజ్వేల్ :** రాష్ట్రంలో అభివృద్ధికి దూరంగా నిలిచిన పద్మశాలీల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుతోపాటు అధ్యక్షునిగా అనిల్ కుమార్ ను నియమించడం పట్ల ఆదివారం గజ్వేల్ లో ఆ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నేతలు రాజారాం, గాడిపల్లి శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, నేత నాగరాజు, మురళి, ఏడేల్లి శ్రీనివాస్, గాడిపల్లి బలరాం, అనూప్ లు మాట్లాడుతూ సమాజంలో పద్మశాలీలు గౌరవప్రదంగా జీవించేందుకు ఆర్థికంగా ప్రోత్సహించాలని కోరారు. కార్పొరేషన్ ఏర్పాటుతో తమ కష్టాలు తీరుతాయని భావిస్తుండగా, పేద పద్మశాలీల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల అమలులో ప్రాధాన్యత ఇవ్వాలని, నేతన్నలకు సైతం అన్ని రకాలుగా సహకరించి వారు తీర్చిదిద్దుతున్న వస్త్రలకు డిమాండ్ దక్కేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా వివిధ పండగల సందర్భంలో చేనేత కార్మికులు తయారు చేస్తున్న చీరలు, వస్త్రలు బట్టలను ప్రభుత్వం నేరుగా సేకరించి ఆర్థిక ప్రయోజనం కల్పించాలని వివరించారు.

## ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన ధరణి స్పెషల్ డ్రైవ్

**ప్రజాపక్షం/నెక్కొండః** కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్, కొన్ని రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ శనివారం విడుదల చేయడంతో దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున, ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిశీలన కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి స్పెషల్ డ్రైవ్ తాత్కాలికంగా నిలిపివేసినట్లు తహసీల్దారు వేముల రాజకుమార్ విలేకరుల సమావేశంలో తెలిపారు. తదుపరి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల అనంతరం ధరణి స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని ఆయన తెలిపారు.

## ఈనెల 24న డివిజన్ స్థాయి అబాకస్, చెస్ పోటీలు




**ప్రజాపక్షం/నర్సంపేట:** లీడ్ పౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న డివిజన్ స్థాయి అబాకస్, చెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు కాసుల శోభ, రవి కుమార్ తెలిపారు. అనంతరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లడుతూ యూకేజీ నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, జూనియర్, సినియర్ రెండు విభాగాల్లో నిర్వహించే ఈపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. ఈపోటీల్లో పాల్గొనదలిచిన విద్యార్థులు 9398148123, 9676867252ల నెంబర్‌లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

## చిల్డ్రన్ పార్క్‌లో కరాటే ఎగ్జామ్



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ పట్టణంలోని స్థానిక చిల్డ్రన్ పార్కులో ఆదివారం రెంజుకి కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నర్సాపూర్ మెదక్ హైదరాబాద్ లకు చెందిన 50 మంది విద్యార్థులకు కరాటే ఎగ్జామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినర్ మాస్టర్ నాగేష్, మాస్టర్ గుర్రాల అశోక్, నవీన్ దివాకర్, ప్రసన్న, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు



**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల కేంద్రంలో నందిగామ నస్కల్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు కై చర్యలు చేపట్టడం జరిగినది. నిజాంపేట గ్రామంలో గ్రామ కార్యదర్శి నర్సింలు కారోబార్ కొండల్ రెడ్డి, నందిగామ గ్రామంలో గ్రామ కార్యదర్శి మహమ్మద్ అరిఫ్ హుస్సేన్, నస్కల్ కార్యదర్శి మమత వారి ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్ అమలుకై చర్యలు చేపట్టడం జరిగినది. గ్రామాలలో గోడ రాతలు, పోస్టర్లు, ఫ్లక్సీలు, కటౌట్లు, బ్యానర్లు, రాజకీయ నాయకుల పోస్టర్లు అన్ని తొలగించడం జరిగినదని తెలిపారు. నేటి నుండి ఎన్నికల నియమావళి వర్తించనని గ్రామాల ప్రజలు గమనించాలని వారు కోరారు.

## కోటగుళ్ళ భవాని మాతకు రూ.5.వేలతో గాజుల బహూకరణ



**ప్రజాపక్షం/గణపురం :** గణపురం మండల కేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ భవాని మాతకు గణపురం మండల కేంద్రానికి చెందిన హరిప్రియ కంగన్ హాల్ నిర్వాహకులు సంగెపు మానస సతీష్ కుమార్ దంపతులు వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా రూ.5 వేలతో ఏడాదికి సరిపడా గాజులను ఆలయానికి బహుకరించారు. ప్రతి సంవత్సరం సతీష్ దంపతులు ఆలయానికి గాజులను అందజేస్తున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు నరేష్ ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. భవాని మాతకు గాజులను బహూకరించిన సతీష్ దంపతులకు కోటగుళ్ళ పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

## రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/మల్హర్‌రావు :** జయశంకర్ జిల్లా మల్హార్ మండలోని కొయ్యూర్ లో ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి లాకావత్ సహేందర్ గ్రామ శాఖ అధ్యక్షులు వేల్పుల మహేందర్ గారి ఆధ్వర్యంలో డిసిసి అధ్యక్షులు జయశంకర్ జిల్లా ఐత ప్రకాష్ రెడ్డి రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ గా పదోన్నతి కల్పించిన సందర్భంగా దుద్దిల్ల శ్రీధర్ బాబు గారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వల్లెంకుంట గ్రామ శాఖ అధ్యక్షులు గడ్డం ప్రేమ్ కుమార్, రామ్, మాజీ ఉప సర్పంచ్ మమత, సింగల్ విండో డైరెక్టర్ రమేష్ రెడ్డి , సీనియర్ నాయకులు నాయకులు మల్లారెడ్డి, రాష్ట్ర మత్స్య శాఖ ప్రధాన కార్యదర్శి జంగిడి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు ఎడ్లపల్లి డాక్టర్ సమ్మయ్య ,ఐత స్వామి, కలముద్దీన్, రాజు, రవీందర్, రమేష్ రెడ్డి, లక్ష్మణ్ కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్షునీకి ఘన సన్మానం



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** డిసీసీ అధ్యక్షుడు ఐత ప్రకాష్ రెడ్డి రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్‌చైర్మన్ గా నియమితులైన సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ తిరుపతి రెడ్డి కాంగ్రేస్ పార్టీ యువజన మండల అధ్యక్షుడు కట్కం అశోక్ తో కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మండలకేంద్రంలోని ఆయన స్వగృహంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంచెలంచెలుగా ఎదుగుతూ వస్తున్న నాయకుడు ఐత ప్రకాస్ రెడ్డి అన్నారు,రాబోయో రోజుల్లో మరెన్నో పదవులు పొందాలని ఆకాంక్షించారు.

## ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుతో అభివృద్ధిలో కురుమలు

**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః** తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ జనాభా కలిగిన కురుమలకు కురుమ ప్రత్యేక కార్పొరేషన్



ఏర్పాటు ద్వారానే కురుమల అభివృద్ధి సాధ్యమని కురుమ సంఘం నాయకులు కంచు ప్రభాకర్, మేకల మహేందర్‌లు అన్నారు. ఆదివారం ములుగులో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కురుమలు గొర్రెల కాపరులుగా గొంగడి నేతగా ఒగ్గు బీర్ల కళాకారులుగా ఉన్నారన్నారు. కురుమలు విద్యా, ఆర్థిక, రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్నారని కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు ఎలుకపల్లి శ్రీనివాస్, మల్లయ్య, రమేష్, సతీష్, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:–** భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 133వ జయంతి పురస్కరించుకుని ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న జరిగే అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ జాతీయ అధ్యక్షురాలు వేముల జ్యోతి, వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్ లో అంబేద్కర్ జయంతి ఉత్సవాల ఆహ్వాన కరపత్రాలను సొసైటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుని జయంతి రోజున మహనీయుల ఆశయ సాధనలో కృషి చేస్తున్న వారిని గుర్తించి పూలే అంబేద్కర్ సేవా రత్న అవార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మెరుగైన సమాజ నిర్మాణం కోసం,మహనీయుల ఆశయ సాధన కోసం సొసైటీలో ఉన్న వనరుల మేరకు మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలు నిర్వహిస్తూ, వారి జీవిత చరిత్ర గ్రంథాలు, పేద విద్యార్థులకు విద్య ఆర్థిక పరంగా ఆదుకోవడం, సామాజికంగా సేవలందించే వారిని ఘనంగా సన్మానించి, అవార్డులు ఉచితంగా అందజేయడమే. సొసైటీ లక్ష్యమన్నారు. ఈ జయంతి ఉత్సవాల్లో సొసైటీ సభ్యులు, అంబెడ్కర్ వాదులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అంబేద్కర్ వాదులు, విద్యార్థి సంఘాలు, కుల, మత, వర్గ, తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఈ జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఏవైయు కాళేశ్వరం జోనల్ అధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్, జోనల్ కోఆర్డినేటర్ పీక కిరణ్, ఏప్‌యు అధికారప్రతినిధి లిగామల్ల వెంకట స్వామి, జిల్లా కార్యదర్శి రాంచందర్, ఏవైయు జిల్లా ఉపాధ్యక్షుడు కేశారపు సురేందర్, కార్యదర్శి ఇందారపు రాకేష్, ఎస్సి, ఎస్టీ ఎంప్లాయిస్ జిల్లా నాయకుడు వనపాకల రాజయ్య, సింగరేణి ఎస్సి, ఎస్టీ ఎంప్లాయిస్ నాయకుడు కర్లపల్లి కిష్టస్వామి,తదితరులు పాల్గొన్నారు.

# మెపా తెలంగాణ భూపాలపల్లి జిల్లా నూతన కమిటీ లు ఎన్నిక



**ప్రజాపక్షం/భూపాలపల్లి టౌన్ :** ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ (మెపా తెలంగాణ) భూపాలపల్లి జిల్లా నూతన కమిటీ, యూత్ కమిటీ నూతనంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ ఆదేశాల మేరకు మెపా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల సుభాష్ ముదిరాజ్ అధ్యక్షతన భూపాలపల్లి ఉద్యోగుల సంఘం ఆఫిసులో ఏర్పాటు చేసిన జిల్లా ముదిరాజ్ విస్తృత సమావేశం అనంతరం జిల్లా కమిటీలు ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షులు గా గొడుగు సాహిత్ ముదిరాజ్,ప్రధాన కార్యదర్శి మండ రవీందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు పిట్టల లింగయ్య ముదిరాజ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా యూత్ అధ్యక్షులు గా జోరు రాజకుమార్ ముదిరాజ్, జిల్లా యూత్ ప్రధానకార్యదర్శి పిట్టల సాయి కుమార్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు పిట్టల చందు ముదిరాజ్,జోరు సంతోష్ ముదిరాజ్, కార్యదర్శి దాసరి రాజకుమార్ ముదిరాజ్, కోశాధికారి గోనెల సాయి ముదిరాజ్ లను నియమిస్తూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల సుభాష్ ముదిరాజ్ నియామక పత్రాలు అందజేశారు. కమిటీ అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల సుభాష్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ జాతి అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మెపా వ్యవస్థాపకులు రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ ఆశయ సాధనలో రాజకీయాలకు అతీతంగా విద్య ఉద్యోగ సాధికారత కోసం కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ముదిరాజ్ మాట్లాడుతూ భూపాల పల్లి జిల్లా లో ముదిరాజ్ లు అందరూ మెపా లో భాగస్వామ్యం కావాలని అన్నారు. నూతన కమిటీ సభ్యులు సాహిత్, రవీందర్ లు సంయుక్తంగా మాట్లాడుతూ జిల్లాలో అందరినీ కలుపుకుని ఐక్య కార్యాచరణ చేస్తాం అని, ఈ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా నాయకులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లొ రాష్ట్ర కార్యదర్శి నిరటి రాజు ముదిరాజ్ హన్మకొండ జిల్లా నాయకులు చెన్నబోయిన సాయి శివ ముదిరాజ్, రాష్ట్ర నాయకులు గోల్కొండ రాజు, రఘుపతి,జిల్లా నాయకులు గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్ లు పాల్గొన్నారు.

# నర్సంపేటలో అదనపు మున్సిఫ్ కోర్టు ప్రారంభం



**ప్రజాపక్షం/నర్సంపేట:** నర్సంపేటలో అదనపు మున్సిఫ్ కోర్టును ఆదివారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు కె. లక్ష్మణ్, నామావరపు రాజేశ్వర్ రావులు ప్రారంభించారు. తొలుత నర్సంపేట మున్సిఫ్ కోర్టుకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులకు వేదపండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈకార్యక్రమంలో వరంగల్, హన్మకొండ జిల్లా కోర్టు న్యాయమూర్తిలు రాదాదేవి, కృష్ణమూర్తి, జిల్లా న్యాయమూర్తులు ప్రేమలత, నర్సంపేట సినియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి సాయి కుమార్, జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శిరీష, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి ములుగు మండల కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః** ములుగు మండల కేంద్రంలో బిజెపి కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఆదివారం పార్టీ కార్యక్రమంలో ఏర్పాటుచేసిన సమావేశానికి మండలాధ్యక్షుడు గాదం కుమార్ హాజరై మాట్లాడారు. క్రమశిక్షణ కలిగిన బిజెపి పార్టీలోని కార్యకర్తలు ఒక సైనికుని వలే పని చేయాలని పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో బిజెపి విజయ పరంపర కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో నరేంద్రమోడీ పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను కేంద్రం అందించనుందని అన్నారు. అనంతరం ములుగు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ములుగు మండల ప్రధాన కార్యదర్శిగా బైకాని మహేందర్, కొత్తపెల్లి విజేందర్, ఉపాధ్యక్షులుగా ఏరువా పాపిరెడ్డి, పేరబోయిన హేమాద్రి, యాద సంపత్, లింగంపల్లి రవీంద్రరావు, గొంగళ్ల కట్టయ్య, కోశాధికారి యాట సాగర్, కార్యదర్శి చంద్రగిరి బిక్షపతి, మచ్చిక రవి, శీలమంతుల చంద్రాచారి, ప్రచార కార్యదర్శిగా నల్లాని జితేందర్‌రావు, మూల జగదీష్, ఓబిసి మోర్చా అధ్యక్షులుగా గుండెబోయిన శ్రీహరి, మహిళా మోర్చా అధ్యక్షురాలుగా ఒద్దుల లక్ష్మి , కిసాన్ మోర్చా అధ్యక్షులుగా కొత్తకొండ రామన్న, దళిత మోర్చా అధ్యక్షులుగా మేకల రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఆర్‌ఎంపి వైద్యుడికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/యశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రోడ్డు ప్రమాదంలో ఆర్‌ఎంపీ వైద్యుడికి తీవ్ర గాయాలైన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రం సమీపంలోని జంగేడులో ఆర్‌ఎంపి గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్న సాంబయ్య పనినిమిత్తం ద్విచక్ర వాహనం ఏపి 36 ఏ క్యూ 8554 గల జిల్లా కేంద్రానికి ద్విచక్రవాహనంపై వచ్చాడు. ఈ క్రమంలో అంబేద్కర్ సెంటర్ వద్ద టీఎస్ 22 టి4995 టిప్పర్ లారీకి తాకి కింద పడడంతో లారీ వెనుక టైర్ల కింద సాంబయ్య పడిపోగా రెండు కాళ్లు విరిగి దీంతో సాంబయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. సాంబయ్య కుమారుడు భరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా ఆర్‌ఎంపి సీనియర్ వైద్యుడు, జిల్లా గౌరవ అధ్యక్షులు సాంబయ్య లారీ ఆక్సిడెంట్ లో గాయపడి హనుమకొండలోని గార్డియన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆర్‌ఎంపీ వైద్యుల అసోసియేషన్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు కత్తి సంపత్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చేపూరు రాజేందర్ లు బాధితున్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు.

## 10 తరగతి పరీక్ష విద్యార్థులకు ఆల్‌ది బెస్టు..



**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి :** ఈనెల 18 నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు మాజీ మంత్రి హరీష్ రావు శుభాశీస్సులు అందచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆశీస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించామన్నారు. ఇందుకు విద్యాశాఖ యంత్రాంగం కలసి సమీక్ష నిర్వహించి అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. మీ భవిష్యత్తు పునాది పదవ తరగతి అని, ఇష్టపడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి సిద్దిపేట నియోజకవర్గంల వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. మీ అమ్మనాన్నల ఆశయాలను నేరవేరుస్తారని ఆశీస్తున్నట్లు తెలిపారు. తాను పంపిన ఉత్తరాలకు మీ తల్లిదండ్రుల నుండి మంచి స్పందన లభించటం తనకు ఆనందాన్ని కల్గించిందన్నారు. మంచి మార్కులు సాధించిన వారికి బాసర ట్రిపుల్ ఐటి సీట్లు సాధించటంతో పాటు జిల్లాను అగ్రస్థానంలో నిలిపినట్లు తెలిపారు. ఈస్థానాన్ని నిలబెట్టుకొని ముందు తరాలకు ఆదర్శంగా నిలపాలన్నారు. మీరంత ఏకగ్రతతో పరీక్షలు రాసి అద్భుతమైన ఫలితాలు సాధించాలని కోరుతూ శుభాశీస్సులు, ఆల్‌ది బెస్టు చెప్పారు.

## నేటి నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** నేటి నుండి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు మండలంలో 580 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు మండల విద్యాధికారి ఉథయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. 18 నుండి నేల 30 వరకు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.30 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షల కోసం మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జగదేవ్‌పూర్ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు బాలికల ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని మునిగడప ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సేక్షన్ విధించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ తెలిపారు. ఇప్పటికే విద్యార్థులందరికి హల్ టికెట్లు అందజేసినట్లు పేర్కొన్నారు.

## అపరిచితులకు ఆశ్రయం కల్పించొద్దు



**ప్రజాపక్షం/గోవిందరావుపేటః** అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించద్దని పస్రా సిఐ అన్నారు. ఆదివారం కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా మచ్చాపూర్ గొత్తికోయ గ్రామంను సందర్శించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించకూడదని, అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించకుండా ఎవరైనా కొత్త వ్యక్తులు తమ గ్రామానికి వస్తే తమకు సమాచారం అందించాలని తెలిపారు. చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎస్ఐ కమలాపూర్ అక్కడి ప్రజల యొక్క సమస్యలను అడిగి తెలుసుకొని వీలైనంత మేరకు వాటిని తీరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత..



**ప్రజాపక్షం/బెజ్జంకి:** మండల పరిధిలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన బీజేవైఎం మండలాధ్యక్షులు తూముల రమేష్ యాదవ్ తండ్రి తూముల బాలయ్య యాదవ్ జ్ఞాపకర్థం ఆదివారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు.అనంతరం రమేష్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి వంద శాతం ఉత్తీర్ణతను సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు, నరేష్, శ్రీకాంత్, సురేష్, శ్రీపాల్, శ్రావణ్, అక్షయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 46 సంవత్సరాల పూర్వ విద్యార్థులు సమ్మేళనం



**ప్రజాపక్షం/జఫర్గఢ్ః** జఫర్గడ్ మండలంలోని కూనూరు ఉన్నత పాఠశాలలో 1978 సంవత్సరములో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం తమ్మడపల్లి ప్రకృతి చికిత్సలయ ఆవరణలో కలుసుకొని తమ తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ అపూర్వ కలయిక సందర్భంగా 25 మంది వారి వారి కుటుంబాలతో ఈ ఆత్మీయ సమ్మేళనములో పాల్గొని తమ గురువులు నేర్పిన విద్య, క్రమశిక్షణ గురించి నెమరు వేసుకున్నారు. చనిపోయిన తమ బాల్య మిత్రుల గురించి తలచుకొని వారికి ఘనంగా నివాళులు అర్పించారు. హాజరైన వారందరూ తమ జీవిత భాగస్వామితో పాల్గొనడం విశేషం. భవిష్యత్తులో బాల్య మిత్రులు అందరూ సామాజిక కార్యకలాపాలు చేపట్టేందుకు మరియు స్నేహ బంధాన్ని మరింత బలంగా తీర్చిదిద్దుకునేందుకు సమిష్టిగా నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా తమ గురువులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ క్రింది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. చిలువేరు రవీందర్, ఎం.జయసింహారెడ్డి, పి.నాగార్జున ప్రసాద్, తోట భాస్కర్, శ్రీమతి పద్మ, బి.పిచ్చి రెడ్డి, బొద్దున వెంకటేశ్వర్లు, బద్రీనాథ్, ఎం. నరసయ్య, యాద మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## మాకు న్యాయం చేయండి...

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా గతేడాది నవంబర్‌లో ములుగు నియోజకవర్గానికి ప్రచార నిమిత్తం 325 మంది ఒగ్గుడోలు, బోనాల కోలాటం కళాకారులను తీసుకెల్లి ప్రచారం చేయించిన తర్వాత పారితోషికాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తమకు న్యాయం చేయాలని కురుమ సంఘం మండల అధ్యక్షులు బండ చంద్రమౌళి అన్నారు. ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రచారం చేయించుకొని డబ్బులు ఇవ్వకపోవడంతో ఇంటికి వచ్చి ధర్నా చేస్తామని హెచ్చరించగా గతేడాది నవంబర్‌లో రూ.9.75లక్షలకు రూ.6లక్షలు ఇచ్చారని మిగతా డబ్బులు పోచంపల్లి శ్రీనివాస్‌ని అడిగిస్తానని తెలిపారని తర్వాత ఫోన్ చేస్తే ఏం చేసుకుంటారో చేసుకోండని అమర్యాదగా మాట్లాడుతున్నారన్నారు. తమకు ఇవ్వాల్సిన డబ్బులను ఎగవేత ద్వారా చేస్తున్న అన్యాయాన్ని అక్రమాలను మీడియా దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం పెద్దలు కడకంచి పాపయ్య, ప్రఖ్యాత చందు యక్షగాన కళాకారులు గడ్డం శ్రీనివాస్, బోనాల కోలాటం కళాకారులు గొరిగె నీల, కడకంచి కావ్య, బాధితులు ఒగ్గురవి, కౌడె ఓనేష్, పాల్గొన్నారు.

## పీఆర్‌టీయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సంగీత, శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** పీఆర్‌టీయు వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పోలేపాక సంగీత, కొండ్రెడ్డి శ్రీనివాస్ రెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో కమిటీలు వేయడంలో భాగంగా వరంగల్ జిల్లాలో అన్ని వర్గలకు ప్రాధాన్యత కల్పిస్తూ జిల్లా శాఖ ఏర్పటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయు తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు గాల్ రెడ్డి హర్ష వర్దన్‌రెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకర్ రెడ్డి, డాక్టర్ పర్వతి సత్యనారాయణలకు వరు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చిన్నారెడ్డి అధ్యక్షతన వేసిన కమిటి తమ రిపోర్టును త్వరిత గతిన ప్రభుత్వానికి అందించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

## అమరుల పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలి...




**ప్రజాపక్షం/పాలకుర్తి:** అమరుల పోరాట స్ఫూర్తితో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని గూడూరు గ్రామంలో ఇటీవల మృతిచెందిన రాజయ్య సంస్మరణ సభ నిర్వహించగా వారు హాజరై మాట్లాడుతూ నమ్మిన సిద్దాంతాన్ని ఎర్రజెండాను చేతబట్టి ప్రజా సమస్యలకోసం పనిచేసిన వ్యక్తి రాజయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బెల్లి సంపత్, రమేష్, సోమసత్యం, మాసంపల్లి నాగయ్య, సుధాకర్, రాజు, శ్రీను, భాస్కర్, సోమన్న, కొముురయ్య, శాంతమ్మ, జంపయ్య, రవి, సంజీవ, పిచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## గుడిసెవాసుల పోరాటాన్ని సందర్శించిన సిపిఎం



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని చిన్నరాంచర్ల గ్రామశివారులో గల 17వ సర్వే నంబర్‌లో నిరుపేదలు, సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకొని సాగిస్తున్న పోరాటానికి సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 174 సర్వే నెంబర్ భూమి ప్రభుత్వ అసైన్డ్‌భూమిలో మండలంలోని అర్హులైన ఇల్లులేని నిరుపేదలు గుడిసెలు వేసుకుంటుంటే పోలీసులు గుడిసెవాసులను విచక్షణా రహితంగా మహిళలను చూడకుండా మగ పోలీసులు వారిపై విరుచుకపడి పిడిగుద్దులు గుద్దడం సరైంది కాదని దీనిపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇప్పటికైనా 174 సర్వే నెంబర్ భూమిని నిరుపేదలకు పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కమిటి సభ్యులు సుంచు విజేందర్, భూ సాధన కమిటి కన్వీనర్ పర్వతం నరసింహులు, రామగల్ల అశోక్, మిన్నలాపురం ఎల్లయ్య, వెంకటవ్వ, రాజవ్వ, తదితరులు పాల్గొన్నారు.